E-KABURU
# ఈ-కబురు
E-PAPER
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
11-04-2025 శుక్రవారం | పేజీలు-6 | హైదరాబాద్
ekaburu.com




మందుబాబులకు షాకింగ్ న్యూస్..
ఆ రోజు వైన్ షాపులు బంద్..
2లో

# యంగ్ ఇండియా

## రేవంత్ రెడ్డి బ్రాండ్ రేవల్యూషన్!"



**పోలీస్ స్కూల్స్‌లో సంచలన మార్పులు:**
**హోంగార్డు పిల్లలకూ డీజీపీ వారసులకూ సమాన అవకాశం**
**గాంధీ పత్రికే ఇన్‌స్పిరేషన్:**
**విద్య, క్రీడలతో నూతన భారత్‌కు బేస్ లేస్తున్న సీఎం**

**హైదరాబాద్, ఏప్రిల్ 10:**
"ప్రతి నాయకుడు తనకంటూ ఓ బ్రాండ్ కల్పించుకుంటాడు. నాపైతే 'యంగ్ ఇండియా' నా బ్రాండ్" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక విద్యా సంస్కరణలు చేపట్టినట్లు ప్రకటించారు.

**గాంధీ స్ఫూర్తితో యంగ్ ఇండియా పథకం**

మహాత్మా గాంధీ 1920-1931 మధ్యకాలంలో నడిపిన "యంగ్ ఇండియా" పత్రిక స్ఫూర్తిగానే తాను యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, పోలీస్ స్కూల్స్ మరియు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నానని సీఎం చెప్పారు. ఇది కేవలం స్కూళ్ల స్థాపన కాదు, భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే మిషన్ అని వివరించారు.

**గాంధీ స్ఫూర్తితో యంగ్ ఇండియా పథకం**
మహాత్మా గాంధీ 1920-1931 మధ్యకాలంలో నడిపిన "యంగ్ తరువాయి 2లో



## విద్యార్థులతో కలిసి ఫుట్ బాల్ ఆడిన సీఎం

**ఈ కబురు,హైదరాబాద్:**
మంచిరేవులలో యాభై ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల మొత్తాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం స్టూడెంట్లతో కలిసి ఫుట్ బాల్ ఆడారు.

మంచిరేపులలో ఏర్పాటైన ఈ పాఠశాలలో ప్రస్తుతానికి ఐదో తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. యాభై శాతం అడ్మిషన్లు పోలీసుల పిల్లలకు కేటాయిస్తుండగా మరో యాభై శాతం ఇతరులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీఎం హాజరయ్యా



## అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం..

**బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదు:కెటిఆర్**

ఎస్‌ఆర్‌డిపి పథకం కింద హైదరాబాద్‌లో చేపట్టిన పనులు 16 నెలల కాంగ్రెస్ పాలనలో నత్త నడకన సాగుతున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఫలక్ నుమా ఆర్‌ఒబిని పట్టించుకునే పరిస్థితి లేదు అని ఆరోపించారు. ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు పెట్టి చంచల్ గూడా జైలుకు పంపే శ్రద్ధ దాని ముందున్న ఫ్లై ఓవర్ పూర్తి చేయడంపై లేదని,శిల్పా లే అవుట్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి కలిపే రెండో లెవెల్ వంతెనది అదే దుస్థితి అని విమర్శించారు. శాస్త్రిపురం ఆర్‌ఒబి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని అన్నారు. పూర్తయినవాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగ్ చేశారు..కానీ నిర్మాణంలో ఉన్నవాటి పురోగతిని సమీక్షించకుండా గాలికి వదిలేశాని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటే కమీషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం, కక్ష తీర్చుకోవడమేనా..? అని ప్రశ్నించారు. హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతల మీద ఉన్న శ్రద్ధ నిర్మాణాల మీద లేదా..? అని నిలదీశారు. అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదని దుయ్యబట్టారు.


**బోడ బాజీ అమ్మకి నా వందనం :**
**కెటిఆర్ బావోద్వేగం**
ఓ గిరిజన వృద్ధురాలు.. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకోవడం పట్ల కెటిఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. తనకు వచ్చిన రూ. 2 వేల పెన్షన్‌లో నుంచి రూ. వెయ్యి తన పెద్ద కొడుకు కెసిఆర్‌కు ఇవ్వాలని మాజీ ఎంపీ మాలోత్ కవితకు అందజేశారని చేశారని..ఇంత ఆప్యాయత, ప్రేమ తెలంగాణల కేవలం కెసిఆర్‌కే సొంతం అని ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. కెసిఆర్ ఒక రాజకీయ నాయకుడు కాదు...ఎంతో మందికి పెద్ద కొడుకు అని, తమ పార్టీని నడిపించే నాయకుడు అని పేర్కొన్నారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని ధారపోసిన దార్శనీకుడు అని వ్యాఖ్యానించారు. ఎన్ని ఢిల్లీ పార్టీలు ఉన్నా...తెలంగాణ ఇంటి పార్టీ బిఆర్ఎస్ అని చెప్పారు. మాది పేగు బంధం...బోడ బాజీ అమ్మకి నా వందనం అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు.



## 11న వారణాసికి ప్రధాని మోదీ..

**రూ. 3.880 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన**

2లో



## చైనాపై సుంకాలు 145 శాతం.. క్లారిటీ ఇచ్చిన వైట్‌హౌస్

**చైనా ఉత్పత్తులపై సుంకాలను 145 శాతానికి పెంచినట్లు అమెరికా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.**

3లో



## కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించిన సుప్రీంకోర్టు సిఈసి కమిటీ



## గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

3లో

## ఘనంగా శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ కలయిక



## భారత్ చేరుకున్న తహవ్వుర్ రాణా!

**ఈ కబురు:ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణాను తీసుకువచ్చిన విమానం భారత్ చేరుకుంది.**

ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా భారత్ చేరుకున్నాడు. అమెరికా నుంచి అతడిని తీసుకువచ్చిన విమానం గురువారం మధ్యాహ్నం దిల్లీ విమానాశ్రయంలో దిగినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. అక్కడ నుంచి అతడిని తిహాడ్ జైలుకు తరలించనున్నట్లు సమాచారం. ఇందుకోసం అధికారులు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని వినియోగించనున్నట్లు తెలిసింది. తహవ్వుర్ రాణా రాక నేపథ్యంలో దిల్లీలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే భద్రత కట్టుదిట్టం చేశారు.

## కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూవే..

### సీసీఎల్ఏకు 2012లోనే కలెక్టర్ లేఖ: హరీశ్‌రావు



**కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు హెచ్‌సీయూకు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది.**

**ఈ కబురు,హైదరాబాద్:**
కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ హెచ్‌సీయూను సందర్శించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం కమిటీతో భేటీ అయింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో డాక్యుమెంట్లు, విజువల్స్‌తో కూడిన నివేదికను భారాస బృందం.. కమిటీకి అందించింది.

అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. "వాల్టా చట్టం ప్రకారం చెట్లు కొట్టాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతి ఇచ్చాకే చెట్లను నరకాలి. ఒక్కో చెట్టుకు రూ.400 డిపాజిట్ చేశాకే కొట్టాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఆందోళన చేసినా అటవీ శాఖ పట్టించుకోలేదు. అటవీ శాఖ స్పందించకపోవడంతోనే చెట్లు నరికేశారు, జంతువులు చనిపోయాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

2011లో కంచ గచ్చిబౌలి భూముల్లో జీహెచ్ఎంసీ లక్ష మొక్కలను నాటింది. ఆ భూముల్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నాటిన మొక్కలు కూడా ఉన్నాయి. అరుదైన పక్షులు, జంతువులు, చెట్లు కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్నాయి. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాటిని భక్షిస్తోంది. కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి గతేడాది నవంబర్ 22న రూ.10వేల కోట్లు రుణం తెచ్చారు. రుణం ఇప్పించిన మధ్యవర్తికి రూ.170 కోట్లు లంచం ఇచ్చారు. మధ్యవర్తికి ఇచ్చిన డబ్బు విషయాన్ని సాక్షాత్తూ అసెంబ్లీలోనే చెప్పారు. ఫార్మాసిటీ కోసం 14వేల ఎకరాలు సేకరించారు కదా.. దానిని 2లో



## అకాల వర్షాలు.. 14,956 ఎకరాల విస్తీర్ణంలో

### పంట నష్టం: వ్యవసాయ శాఖ నివేదిక

**రాష్ట్రంలో గత నెలలో కురిసిన వడగళ్ల వానకు 8,408 ఎకరాల విస్తీర్ణంలో పంటల నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ రైతువారీ నివేదిక ప్రభుత్వానికి అందించింది.**

**ఈ కబురు,హైదరాబాద్:**
రాష్ట్రంలో గత నెలలో కురిసిన వడగళ్ల వానకు 8,408 ఎకరాల విస్తీర్ణంలో పంటల నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో ఈ 3 నుంచి 9వ తేదీ వరకు 7 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కురిసిన వర్షాలు, ఈదురు గాలుల ప్రభావంతో సంభవించిన పంట నష్టంపై కూడా ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. ఇప్పటివరకు 14,956 ఎకరాల 2లో


2లో

## చల్లబడిన వాతావరణం.. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం

**నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. తాజాగా వర్షం మొదలైంది.**



## తొందరపాటు లేదు.. అమెరికాతో ఒప్పందంపై పీయూష్ గోయల్

4లో

## 'ప్రజలకు న్యాయమైన, వేగవంతమైన సేవలందించేందుకే స్లాట్ బుకింగ్

**రాష్ట్రంలో 22 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఇవాళ్టి నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలు - ప్రజలకు స్లాట్ బుకింగ్‌పై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**



**ఈ కబురు :** ప్రజలకు సులువుగా న్యాయమైన, వేగవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా సబ్ రిజిస్ట్రార్ 2లో



## 11న వారణాసికి ప్రధాని మోదీ.. రూ. 3.880 కోట్ల విలువైన ప్రాజక్టులకు శంకుస్థాపన

**ఈ కబురు,న్యూఢిల్లీ:**
ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ 11న ఉత్తరప్రదేశ్‌లోని తన నియోజకవర్గమైన వారణాసిని సందర్శించనున్నారు. ఈ సందర్భంలో ఆయన ఒక బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడనున్నారు. అలాగే రూ. 3880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వారణాసి డివిజనల్ కమిషనర్ కౌశల్ రాజ్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రాజెక్టులలో గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు పథకాలు ఉన్నాయి.

వీటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, 100 నూతన అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పిండ్రాలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయి. అలాగే ప్రధానమంత్రి పోలీస్ లైన్స్‌లో ఒక ట్రాన్సిట్ హాస్టల్, రామ్‌నగర్‌లో పోలీస్ బ్యారక్‌లు, నాలుగు గ్రామీణ రహదారులను ప్రారంభించనున్నారు. శాస్త్రి ఘాట్, సమ్నే ఘాట్‌లను కూడా ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఇదేవిధంగా వారణాసి డెవలప్‌మెంట్ అథారిటీ (వీడీఏ) చేపట్టిన వివిధ ప్రాజెక్టులను కూడా ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 11న ఉదయం 10 గంటలకు ప్రధాని మోదీ వారణాసి లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగనున్నారు. తరువాత రెండున్నర గంటల పాటు అక్కడే ఉంటారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. 4,000 మంది పోలీసులను మోహరించారు. మోదీ రాక సందర్భంగా జరిగే బహిరంగ సభలో 50 వేల మందికి పైగా జనం పాల్గొనే అవకాశం ఉంది.



## చైనాపై సుంకాలు 145 శాతం.. క్లారిటీ ఇచ్చిన వైట్‌హౌస్

**చైనా ఉత్పత్తులపై సుంకాలను 145 శాతానికి పెంచినట్లు అమెరికా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.**

**ఈ కబురు** ,వాషింగ్టన్ డీసీ: అమెరికా చైనా మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. చైనా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచినట్లు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే గతంలో ఫెంటనిల్ అక్రమ రవాణాకు సంబంధించి విధించిన 20శాతం సుంకాలకు అదనమని అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ తాజాగా వెల్లడించింది. దీంతో చైనాపై సుంకాలు 145శాతానికి చేరుకున్నాయని స్పష్టం చేసింది. చైనాదిగుమతులపై భారీ స్థాయిలో సుంకాలు విధిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనలతో ఆ రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం తారా స్థాయికి చేరింది. అమెరికా చర్యలకు దీటుగా స్పందిస్తున్న చైనా.. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది. బీజింగ్ చర్యపై తీవ్రంగా ప్రతిస్పందించిన ట్రంప్.. చైనాపై టారిఫ్‌లను ఇటీవలే ఏకంగా 125శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా చైనాపై విధించిన సుంకాలు మొత్తంగా 145 శాతానికి చేరుకున్నట్లు వైట్‌హౌస్ స్పష్టం చేసింది. అటు చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించింది.

## 'ప్రజలకు న్యాయమైన, వేగవంతమైన సేవలందించేందుకే స్లాట్ బుకింగ్

**మొదటి పేజి తరువాయి**
కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 22 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఇవాళ్టి నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి వచ్చినట్లుగా ఆయన వివరించారు. ఈ 22 కార్యాలయాల్లో వచ్చే ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.



స్లాట్‌బుకింగ్‌పై అవగాహన కల్పించండి : రెవెన్యూ విభాగంలో ఎలాంటి సంస్కరణ చేపట్టినా, ఏ విధానపరమైన నిర్ణయం తీసుకున్నా అది ప్రజల కోణంలోనే ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. తొలిరోజు స్లాట్ బుకింగ్ అమలు తీరు, ప్రజల నుంచి వచ్చిన స్పందన గురించి అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు.

తొలిరోజు స్లాట్ బుకింగ్ చేసుకున్న 626 మంది : ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం తొలిరోజు( గురువారం) 626 మంది స్లాట్ బుకింగ్ చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చి గంటల తరబడి చెట్ల కింద వేచిఉండి, క్యూలైన్లలో నిలబడే పరిస్థితికి , సమయాన్ని ఆదా చేసేందుకు, పారదర్శకతను తీసుకొచ్చేందుకే ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చినట్లుగా వివరించారు. త్వరలో క్యూలైన్లకు గుడ్‌బై చెప్పడమే కాకుండా దళారుల ప్రమేయం కూడా ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుండటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

మెరుగైన సేవలు పొందేందుకు అవకాశం : రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్ లో స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆ రోజు నిర్దేశిత సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందని పొంగులేటి తెలిపారు. సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా అపాయింట్‌మెంట్ తేదీ, సమయాన్ని కూడా ముందే తెలుసుకోవచ్చని వివరించారు. నిర్దేశిత తేదీ, సమయంలో ఎలాంటి హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ పని పూర్తి చేసుకోవచ్చని వివరించారు. ఈ పారదర్శక విధానంతో మధ్యవర్తుల ప్రభావానికి తెరపడనుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.




# యంగ్ ఇండియా

**మొదటి పేజి తరువాయి**
ఇండియా" పత్రిక స్ఫూర్తిగానే తాను యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, పోలీస్ స్కూల్స్ మరియు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌స్‌ను ఏర్పాటు చేస్తున్నానని సీఎం చెప్పారు. ఇది కేవలం స్కూళ్ల స్థాపన కాదు, భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే మిషన్ అని వివరించారు.

**హోంగార్డు నుంచి డీజీపీ పిల్లలకూ సమాన హక్కులు**
పోలీస్ శాఖలోని హోంగార్డుల నుంచి డీజీపీ స్థాయి అధికారుల పిల్లలకూ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్‌లో ప్రవేశం లభించనుందని సీఎం వెల్లడించారు. ఈ స్కూళ్ల ద్వారా పోలీస్ కుటుంబాలకు గౌరవంగా విద్యాబోధన అందించడమే లక్ష్యమన్నారు.

**ప్రతి నియోజకవర్గానికి ఓ ఇంటిగ్రేటెడ్ స్కూల్**
ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లు నిర్మించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్ కేటాయించినట్టు చెప్పారు. చదువే తన మొదటి ప్రాధాన్యత అని మరోసారి స్పష్టం చేశారు.

**స్కిల్ వర్సిటీ = నైపుణ్య ఉద్యోగాలు**
తెలంగాణలో ప్రతి ఏటా ఇంజినీరింగ్ పూర్తి చేసే 1.10 లక్షల విద్యార్థుల్లో నైపుణ్యం కొరత ఉందని, అందుకే స్కిల్ వర్సిటీని ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే మొదటి బ్యాచ్‌కు 100% ప్లేస్‌మెంట్ లభించిందని, ప్రముఖ కంపెనీలు ఎంపిక చేశాయని వెల్లడించారు. ఈ వర్సిటీని మహీంద్రా గ్రూప్‌తో భాగస్వామ్యంలో నడుపుతున్నట్టు చెప్పారు.

**స్పోర్ట్స్ వర్సిటీతో ఒలింపిక్ లక్ష్యాలు**
ఒలింపిక్స్‌లో భారత్ స్థాయి పెరగాలన్న ఉద్దేశంతో స్పోర్ట్స్ వర్సిటీని స్థాపిస్తున్నామని సీఎం చెప్పారు. కొరియా లాంటి దేశాల నుంచి బంగారు పతకాలు వచ్చాయి, మన దేశం మాత్రం వెనుకబడినట్టు తెలిపారు. "ఇంకా మనం ఎందుకు వెనుకుండాలి?" అన్నది తన ఆలోచన అని అన్నారు.

**సారాంశం:**
సీఎం రేవంత్ రెడ్డి తీసుకొస్తున్న యంగ్ ఇండియా విద్యా విప్లవం రాష్ట్ర యువతను ప్రపంచ స్థాయిలో పోటీ చేయగల స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో సాగుతోంది. చదువు, నైపుణ్యం, క్రీడలతో పాటు సమానత్వం, ప్రగతిని కలసి కలగలిపే ఈ పథకం, రాబోయే రోజుల్లో తెలంగాణ బ్రాండ్‌గానే నిలుస్తుందన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

## తహవ్వూర్ రాణా అరెస్టు.. ఫొటో షేర్ చేసిన NIA

**ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వూర్ హుస్సేన్ రాణాను అదుపులోకి తీసుకున్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది.**

**ఈ కబురు:** ముంబయి ఉగ్రదాడి కేసులో ప్రధాన సూత్రధారి తహవ్వూర్ హుస్సేన్ రాణాను భారత్‌కు తీసుకొచ్చారు. అమెరికా నుంచి అతడిని తీసుకువచ్చిన ప్రత్యేక విమానం గురువారం సాయంత్రం దిల్లీ విమానాశ్రయంలో దిగింది. రాణాను అదుపులోకి తీసుకున్నట్లు ఎన్‌ఐఏ అధికారికంగా ధ్రువీకరించింది. ఎన్‌ఐఏ, ఎన్‌ఎస్‌జీ సీనియర్ అధికారులతో కూడిన బృందాలు రాణాను లాస్ ఏంజెల్స్ నుంచి ప్రత్యేక విమానంలో దిల్లీకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. విమానాశ్రయంలో అవసరమైన చట్టపరమైన ప్రక్రియన్నింటినీ పూర్తి చేసిన అనంతరం అతడు విమానం నుంచి బయటకు రాగానే.. అధికారికంగా అరెస్టు చేసినట్లు ఎన్‌ఐఏ తహవ్వూర్ రాణాను ఎన్‌ఐఏ అదుపులోకి తీసుకున్న అనంతరం కొన్ని ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అతడిని చట్టం ముందు నిలబెట్టేందుకుగాను ఏళ్ల తరబడి నిరంతర సమష్టి ప్రయత్నాలు చేసినట్లు ఎన్‌ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది.‘‘ఎన్‌ఐఏ, ఎన్‌ఎస్‌జీ, భారత విదేశాంగ శాఖ, హోంశాఖ, యూఎస్‌డీఓజే, యూఎస్ స్కై మార్షల్, అమెరికాలోని సంబంధిత అధికారుల సమన్వయంతో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యింది’’ అని పేర్కొంది. ఇదిలాఉంటే, తహవ్వూర్‌ను ఈ మధ్యాహ్నమే దిల్లీకి తరలించారన్న వార్తలు వచ్చినప్పటికీ.. ఎన్‌ఐఏ ఈ విషయాన్ని సాయంత్రం ధ్రువీకరించడం గమనార్హం.ఈ కేసులో ఎన్‌ఐఏ తరఫున సీనియర్ అడ్వకేట్ దయాన్ కృష్ణన్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ హాజరయ్యారు. ఇప్పటికే వీరిద్దరూ కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే, ఈ కేసు గురించి స్పందించేందుకు వారు నిరాకరించారు.

## కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూవే..

**మొదటి పేజి తరువాయి**
అభివృద్ధి చేయండి. అక్కడ ఎలాంటి చెట్లు, వన్యప్రాణులు లేవు. కంచ గచ్చిబౌలి భూములు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందినవే. ఈ భూములు హెచ్‌సీయూకి చెందినవే అని సీసీఎల్ఏకు 2012లోనే అప్పటి కలెక్టర్ లేఖ రాశారు’’ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## అకాల వర్షాలు.. 14,956 ఎకరాల విస్తీర్ణంలో



**మొదటి పేజి తరువాయి**
విస్తీర్ణంలో వరి, మొక్కజొన్న, మామిడి సహా పలు రకాల పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో రైతువారీగా సర్వే చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు త్వరలో రైతులకు పరిహారం చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## మందుబాబులకు షాకింగ్ న్యూస్.. ఆ రోజు వైన్ షాపులు బంద్..

**ఈ కబురు:** భాగ్యనగరంలోని మందు బాబులకు ఇది షాకింగ్ న్యూసే అని చెప్పవచ్చు. ఏప్రిల్ 12 వ తారీఖున హనుమాన్ జయంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ మహానగరంలో అన్ని మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఈ మేరకు నగర కమీషనర్ సీవీ ఆనంద్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్లుండి హైదరాబాద్ మహా నగరమంతా జై హనుమాన్ నినాదాలతో మార్మోగనుందని.. ఈ నేపథ్యంలో ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోవద్దని పోలీసులను ఆయన ఆదేశించారు.




మద్యం దుకాణాలు, బార్లతో పాటు కల్లు కాంపౌండ్‌లను కూడా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జరిగిన శ్రీరామ నవమి సందర్భంగా కూడా మద్యం దుకాణాలు మూతపడిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 12న ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 13వ తేదీ ఉదయం 6 గంటల వరకూ మద్యం దుకాణాలను మూసివేయాలని నగర కమీషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. జంట నగరాల్లోని మద్యం దుకాణాల యజమానులు తప్పనిసరిగా ఈ ఆదేశాలను పాటించాలని ఆయన చెప్పారు. లేని పక్షంలో చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీవీ ఆనంద్ హెచ్చరించారు.

గత ఆదివారం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని హైదరాబాద్ నగరంలో మద్యంపై ఆంక్షలు విధించిన విషయ తెలిసిందే. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ పోలీసులు నిషేధం విధించారు. దీంతో నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలంతా చాలా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకున్నారు. ఈ క్రమంలో హనుమాన్ జయంతిని కూడా భక్తులు ప్రశాంత వాతావరణంలో అంగరంగ వైభవంగా.. ఎలాంటి వివాదాలు తావు లేకుంలడా జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర పోలీస్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# చల్లబడిన వాతావరణం..
## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం

**నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. తాజాగా వర్షం మొదలైంది.**

**ఈ కబురు,హైదరాబాద్:**
నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. తాజాగా వర్షం మొదలైంది. మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. మేడ్చల్, గగిల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు పడుతున్నాయి. ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది.



రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే సూచనలున్నాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపింది. రేపు (ఏప్రిల్ 11న) కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వికారాబాద్ జిల్లా తాండూరులో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. విద్యుత్ సరఫరా మూడు గంటలుగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్**
రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. వాతావరణ శాఖ సూచనలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటూ.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం

# కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించిన
# సుప్రీంకోర్టు సిఈసి కమిటీ

**ఎంసిహెచ్ఆర్డీలో విద్యార్థులు, జెఏసి ప్రతినిధులతో కమిటీ సమావేశం**



కంచ గచ్చిబౌలి భూములను పరిశీలిస్తున్న సిఈసి కమిటీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
గచ్చిబౌలిలోని కంచ గచ్చిబౌలి భూములను గురువారం సుప్రీంకోర్టు నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ( సిఈసి) పరిశీలించింది. పలు విభాగాలకు చెందిన అధికారులు, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, మాదాపూర్ డిసిపి వినీత్ లతో కలిసి కమిటీ సభ్యులు కంచ గచ్చిబౌలి భూములను సందర్శించారు. ఈ సందర్భంగా వివాదానికి కేంద్రమైన 400 ఎకరాల భూముల స్థితిగతులు, అక్కడ ఉన్న పర్యావరణం, అటవీ సంపద, జంతువుల వివరాలను సేకరించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వివాదస్పదంగా మారిన విషయం తెలిసిందే. కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబరు 25లో గల 400 ఎకరాల భూములు ప్రభుత్వానివని రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీ భూములంటూ వర్సిటీ వర్గాలు ముందుకు రావడం వివాదస్పదంగా మారింది. ఓ వైపు యూనివర్సిటీ భూముల రక్షణ కోసం విద్యార్థులు ఆందోళన బాటపట్టగా, అదే సమయంలో సదరు భూముల్లో ఉన్న చెట్లను తొలగిస్తూ భారీ ఎత్తున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనులు చేపట్టడం సంచలనంగా మారింది. దీంతో పనులను అడ్డుకుంటూ విద్యార్థులు ఆందోళన చేపట్టగా, పోలీసులు పలువురు విద్యార్థుల మీద కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టులు చేశారు. విద్యార్థుల అరెస్టుతో ఒక్కసారిగా భగ్గుమన్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు కలిసి జెఏసిగా ఏర్పడి ఆందోళనను ఉధృతం చేశారు. వీరి ఆందోళనలకు రాజకీయ వర్గాల నుంచి మద్దతు రావడంతో ఈ వివాదం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో పాటు 400 ఎకరాల భూమిలో ఉన్న పర్యావరణాన్ని దెబ్బతీస్తూ భారీ ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం చెట్లను తొలగిస్తుందని, సదరు భూమిలో ఉన్న వన్యప్రాణుల ఉనికి ప్రమాదకరంగా మారిందని విద్యార్థులు విడుదల చేసిన వీడియోలు, ఫోటోలతో పర్యావరణవేత్తలు, పలు సంఘాలు ఆందోళన చెందాయి. దీంతో ఈ వివాదంపై సూమోటోగా స్పందించిన సుప్రీంకోర్టు 400 ఎకరాల భూమిపై స్టే విధించింది. సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు సదరు భూముల్లో ఎటువంటి పనులు చేపట్టవద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వివాదస్పద భూముల్లో పరిస్థితిపై నివేదిక అందించేందుకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సిఈసి)ని సుప్రీంకోర్టు నియమించింది. దీంతో పలు విభాగాల అధికారులతో కలిసి సిఈసి కమిటీ గురువారం కంచ గచ్చిబౌలి భూములను సందర్శించారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో వర్సిటీకి చేరుకున్న సిఈసి కమిటీ కంచ గచ్చిబౌలిలోని భూములను సందర్శించి అందులో ఉన్న పర్యావరణం, ప్రభుత్వం చేపట్టిన పనులు, అటవీ సంపదపై వివరాలు సేకరించారు. కాగా కంచ గచ్చిబౌలి భూముల సందర్శనకు వచ్చిన సిఈసి కమిటీని కలిసేందుకు వర్సిటీ విద్యార్థులకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో పలువురు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం

## ఎంసిహెచ్ఆర్డీలో సమావేశం...

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్, జెఏసి ప్రతినిధులు, టీచర్స్ ఆసోసియేషన్ ప్రతినిధులు గురువారం జూబ్లిహిల్స్ లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సుప్రీంకోర్టు సిఈసి కమిటీతో సమావేశమయ్యారు. మొదట కంచ గచ్చిబౌలి భూముల పరిశీలన సమయంలో కమిటీని కలిసేందుకు విద్యార్థులు ప్రయత్నించగా, పోలీసులు అనుమతించలేదు. అనంతరం ప్రతినిధులను ఎంసిహెచ్ఆర్డీకి పిలువడంతో వారు కమిటీని కలిసి తమ డిమాండ్లను వివరించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్న పరిస్థితిని కమిటీకి వివరించడంతో పాటు ప్రభుత్వం చేసిన పనులు, ధ్వంసం చేసిన పర్యావరణాన్ని ఆధారాలతో కమిటీకి అందజేసినట్లు స్టూడెంట్ యూనియన్ సభ్యులు తెలిపారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల వర్సిటీ భూముల పరిరక్షణ కోసం స్టూడెంట్ యూనియన్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ప్రభుత్వం విద్యా సంస్థకు కేటాయించిన భూముల వేలాన్ని ఇప్పటికైనా నిలిపివేయాలని సూచించారు. కంచ గచ్చిబౌలి భూములు ఎప్పటికీ వర్సిటీ భూములేనని ఒక ప్రకటనలో తేల్చి చెప్పారు.

# గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

సోమాలియా సివిల్ వార్ కాల్పుల్లో
యువకుడి మెదడులోకి దిగిన బుల్లెట్
క్లిష్టమైన సర్జరీతో బుల్లెట్ ను తొలగించిన కేర్ వైద్యులు



రోగి మహ్మద్ హెర్సీతో కలిసి సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు



రోగి మెదడులో నుంచి తొలగించిన బుల్లెట్



రోగి మెదడులో నుంచి తొలగించిన బుల్లెట్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** అత్యంత క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా నిర్వహించిన గచ్చిబౌలి కేర్ ఆసుపత్రి వైద్యులు విదేశీ యువకుడికి పునర్జన్మ ప్రసాదించారు. సోమాలియా దేశం సివిల్ వార్ కాల్పుల్లో ఓ యువకుడి మెదడులోకి బుల్లెట్ దిగగా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి అరుదైన శస్త్రచికిత్స చేసిన కేర్ హాస్పిటల్ వైద్యులు మెదడులో నుంచి బుల్లెట్ ను తొలగించారు. మెడికల్ హబ్ గా మారిన హైదరాబాద్ నగర ఖ్యాతిని మరింత ఇనుమడించే విధంగా రోగిని పూర్తి ఆరోగ్యంగా చేశారు. నగరంలోని గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో జరిగిన ఈ శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను గురువారం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో రోగితో కలిసి న్యూరోసర్జన్ డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు వెల్లడించారు. ఈ సందర్భంగా లక్ష్మీనాథ్ మాట్లాడుతూ సోమాలియా దేశ సివిల్ వార్ లో గులేమ్ మహ్మద్ హెర్సీ(26) మీద కాల్పులు జరిగాయని, ఈ కాల్పుల్లో ఓ బుల్లెట్ హెర్సీ తల నుంచి దూసుకువెళ్లిందన్నారు. హెర్సీ నుదిటి మీద నుంచి పుర్రెను చీల్చుకుంటూ వెళ్లిన బుల్లెట్ చిన్నమెదడులో చేరిందన్నారు. సంఘటన అనంతరం రెండు నెలల పాటు సోమాలియాలోనే హెర్సీ చికిత్స తీసుకోగా, అక్కడ బుల్లెట్ తొలగించేందుకు డాక్టర్లు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో కుటుంబ సభ్యులు అసస్మారక స్థితిలో ఉన్న హెర్సీని ఎయిర్ అంబులెన్స్ ద్వారా గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. హెర్సీకి అన్ని పరీక్షలు నిర్వహించి తీవ్ర అనారోగ్యంతో పాటు కాళ్లు, చేతులు బలహీనతతో ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో హెర్సీ మెదడులో నుంచి బుల్లెట్ తొలగించేందుకు సర్జరీ చేయాలని డాక్టర్ల బృందం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులతో చర్చించి గత రెండు వారాల క్రితం అత్యంత క్లిష్టమైన సర్జరీని ఏకదాటిగా 12 గంటల పాటు నిర్వహించి విజయవంతంగా మెదడులో నుంచి బుల్లెట్ తొలగించామన్నారు. ఎటువంటి బ్లడ్ బ్లీడింగ్ లేకుండా, మెదడులోని బ్లడ్ సెల్స్ దెబ్బతినకుండా విజయవంతంగా సర్జరీ చేశామని, ప్రస్తుతం రోగి కోలుకుంటున్నాడని తెలిపారు. హెర్సీ మెదడులో నుంచి తొలగించిన బుల్లెట్ 3 సెంటీమీటర్ల పొడవు, 1సెంటీ మీటర్ వెడల్పు ఉందన్నారు. మరో రెండు వారాల్లో హెర్సీ పూర్తిగా కోలుకుంటాడని అన్నారు. సమావేశంలో గచ్చిబౌలి కేర్ ఆసుపత్రి సిఓఓ డాక్టర్ నీలేష్ తో పాటు ఆసుపత్రి డాక్టర్లు. సిబ్బంది పాల్గొన్నారు.

# గచ్చిబౌలి డివిజన్ లో అన్ని కూడళ్లను సుందరీకరిస్తాం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి





గచ్చిబౌలి డివిజన్ లో అన్ని కూడళ్లను సుందరీకరిస్తాం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న అన్ని కూడళ్లను సుందరీకరిస్తామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి జంక్షన్, నల్లగండ్ల, తెల్లాపూర్ చౌరస్తాలను పూర్తిగా ఆధునీకరించి, విద్యుత్తు వెలుగులతో సుందరంగా తీర్చిదిద్దారు. అభివృద్ధి చేసిన ఈ కూడళ్లను తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ లతో కలిసి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కూడలిని సుందర శోభిత వనంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధి చేసిన జంక్షన్లను ప్రారంభించుకోవడం సంతోశంగా ఉందన్నారు. అన్ని హంగులతో ,సకల సౌకర్యాలతో కూడలిని అభివృద్ధి చేయడం జరిగిందని, ప్రజలు, వాహనదారులు, స్థానికులను ఆకట్టుకునేలా అద్భుతంగా తీర్చిదిద్దడం జరిగింధన్నారు. స్థానికులు, వాహనదారులు కాసేపు సేద తిరడానికి అనువుగా, కూర్చోడానికి వీలుగా బల్లలు ఏర్పాటు చేసి, ప్రతి కూడలిని సుందర శోభిత వనంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి :
# మాజీ కార్పొరేటర్ సాయిబాబా

**ఈ-కబురు, శేరిలింగంపల్లి**
బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య నాయకుల ఆత్మీయ కలయిక సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు. మియాపూర్ లోని అతిథి హాల్ లో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, వివేకానంద నగర్ కార్పొరేటర్ రోజా దేవి రంగారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సాయిబాబా మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఆత్మీయ కలయిక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీన వరంగల్ లో నిర్వహిస్తున్న పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు రజతోత్సవ సభకు భారీ ఎత్తున తరలిరావాలని సూచించారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ తో పాటు పార్టీ అగ్ర నాయకులు హాజరవుతారని, సభలో పార్టీ భవిష్యత్ ప్రణాళికలను కెసిఆర్ ప్రకటిస్తారని అన్నారు. నేడు తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని, భవిష్యత్తులో రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ అఖండ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మారబోయిన రవి యాదవ్, పురుషోత్తం యాదవ్, మిద్దెల మల్లారెడ్డి, హరీష్ రావు, రవీందర్ యాదవ్, బాబు మోహన్ మల్లేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, శేఖర్ గౌడ్, బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, రోజా, శ్రీనివాస్, బాబూమియా, జమీర్ సలీం, భద్రయ్య, సతీష్ రావు, అలాఉద్దీన్ పటేల్, రాములు, పెద్ద భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# వాలంతరిని పునరుద్ధరిస్తాం
# ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**నీరు-భూ నిర్వహణ, శిక్షణ పరిశోధన సంస్థ (వాలంతరి)ను పునరుద్ధరిస్తామని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.**

**ఈ కబురు, హైదరాబాద్:**
నీరుభూ నిర్వహణ, శిక్షణ పరిశోధన సంస్థ (వాలంతరి)ను పునరుద్ధరిస్తామని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వాలంతరి సంస్థను గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం ఈ సంస్థను నిర్లక్ష్యం చేసిందని ఆక్షేపించారు. రైతులకు, గ్రామీణ యువతకు వాలంతరిలో శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అన్ని శాఖలు ఈ సంస్థను ఉపయోగించుకునే విధంగా లేఖలు రాస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 14న సాగునీటి పారుదల శాఖలో 224 మంది ఏఈలు, 199 మంది జూనియర్ సాంకేతిక అధికారులకు ఈ కేంద్రంలో నియామక పత్రాలు అందించనున్నారని చెప్పారు. ఈ సంస్థ భూములు ఆక్రమణలకు గురయ్యాయని తెలుసుకుని.. విచారణకు ఆదేశించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, వాలంతరి డైరెక్టర్ జనరల్ అనిత పాల్గొన్నారు.






# ట్యాక్స్ పేయర్లకు లాస్ట్ ఛాన్స్

## ఆ స్కీమ్ తుది గడువు ప్రకటించిన ఐటీ శాఖ

**న్యూఢిల్లీ:** పన్ను వివాదాల పరిష్కారానికి తీసుకువచ్చిన వివాద్ సే విశ్వాస్ పథకానికి ఆదాయ పన్ను శాఖ తాజాగా తుది గడువును ప్రకటించింది. పన్ను చెల్లింపుదారులు 2025 ఏప్రిల్ 30లోగా పథకాన్ని వినియోగించుకునేందుకు డిక్లరేషన్‌ను సమర్పించవలసి ఉంటుందని స్పష్టం చేసింది. తద్వారా 2024 అక్టోబర్ 1న ప్రవేశపెట్టిన ఈ పథకానికి తొలిసారి తుది గడువును సీబీడీటీ నోటిఫై చేసింది.

పన్ను సంబంధ బకాయిలపై ప్రత్యక్ష పన్నుల పథకాన్ని ఆశ్రయించేవారు ఈ నెల 30లోగా డిక్లరేషన్‌ను ఇవ్వవలసి ఉంటుందని ఆదాయపన్ను శాఖ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. పన్ను సంబంధిత వివాదాలు లేదా వివిధ అప్పీళ్లలో భాగమైన పన్ను చెల్లింపుదారులు పథకాన్ని తుది గడువు లోగా వినియోగించుకోవచ్చునని వివరించింది.

సుమారు 2.7 కోట్ల ప్రత్యక్ష పన్ను డిమాండ్ల ద్వారా రూ. 35 లక్షల కోట్లు వివిధ వివాదాలలో నమోదైన నేపథ్యంలో పథకానికి ప్రాధాన్యత ఏర్పడింది. పన్ను చెల్లింపుదారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలంటే.. వివాదంలో ఉన్న పన్నుపై 110 శాతాన్ని చెల్లించవలసి ఉంటుంది. 2024 వివాద్ సే విశ్వాస్ పథకానికి 2024-25 బడ్జెట్‌లో తెరతీశారు. 2024 అక్టోబర్ 1న నోటిఫై చేశారు.






# హైదరాబాద్ కంపెనీ ఒలెక్ట్రాకు రూ. 424 కోట్ల డీల్

## 297 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిగ్గజం ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌టీసీ) నుంచి 297 బస్సుల సరఫరా, నిర్వహణకు భారీ ఆర్డరు లభించింది. కాంట్రాక్ట్ ప్రకారం లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్‌వోఏ) తేదీ నుంచి 11 నెలల్లో బస్సులను అందించాల్సి ఉంటుంది.

ఈ డీల్ విలువ సుమారు రూ. 424.01 కోట్లని కంపెనీ వివరించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కొండ ప్రాంతాల్లో నడిపేందుకు ప్రత్యేకంగా రూపొందిన ఈ బస్సులు 30 మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యంతో ఉంటాయి. ఒక్కసారి చార్జ్ చేస్తే 180 కి.మీ. వరకు ప్రయాణిస్తాయి.

ఒక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఇన్ని విద్యుత్ బస్సులను నేరుగా కొనుగోలు చేయడం దేశీయంగా ఇదే తొలిసారని ఒలెక్ట్రా సీఎండీ కేవీ ప్రదీప్ చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించి దేశీయంగా అతి పెద్ద ఆర్డరును అందుకోవడం తమకు గర్వకారణమని తెలిపారు.

# రూ.95,000కు చేరిన పసిడి

**అంతర్జాతీయ ఆర్థిక ఉద్రిక్తతలతో బంగారం ధర చుక్కలనంటుతోంది. అమెరికా, చైనాల మధ్య సుంకాల పోటీ తీవ్రమైన నేపథ్యంలో.. సురక్షితమని భావించే పసిడిపైకి మళ్లీ పెట్టుబడులు వచ్చాయి.**



అంతర్జాతీయ ఆర్థిక ఉద్రిక్తతలతో బంగారం ధర చుక్కలనంటుతోంది. అమెరికా, చైనాల మధ్య సుంకాల పోటీ తీవ్రమైన నేపథ్యంలో.. సురక్షితమని భావించే పసిడిపైకి మళ్లీ పెట్టుబడులు వచ్చాయి. ఫలితంగా ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర అంతర్జాతీయ విపణిలో గురువారం 3164 డాలర్లకు చేరింది. దీన్ని అనుసరించి దేశీయంగా 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.95,000ను మించింది. రాత్రి 11.30 గంటల సమయానికి ఔన్సు ధర 3161 డాలర్ల వద్ద ఉండగా, హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.94,500 వద్ద ట్రేడ్ అవుతోంది. కిలో వెండి ధర రూ.94,600 దగ్గర ఉంది.

# పెట్రోల్ బైకులు, సీఎన్‌జీ ఆటోలు బ్యాన్!

**ఢిల్లీలో వాయుకాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అక్కడి ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. త్వరలోనే 'ఈవీ పాలసీ 2.0'ను తీసుకురావడానికి సన్నద్ధమవుతోంది. దీనికి మంత్రి వర్గం నుంచి ఆమోదం లభించిన తరువాత.. పెట్రోల్, డీజిల్ సీఎన్‌జీ బైకులను పూర్తిస్థాయిలో నిషేధించడానికి ఢిల్లీ సర్కార్ అడుగులువేస్తుంది.**



ఈవీ పాలసీ 2.0 అమలులోకి వచ్చిన తరువాత.. వచ్చే ఏడాది నుంచే పెట్రోల్, సీఎన్‌జీ బైకులను బ్యాన్ చేయనున్నారు. 2027 డిసెంబర్ 31 నాటికి ఢిల్లీలో వందశాతం ఎలక్ట్రిక్ వాహనాలను నడపాలని ఉద్దేశ్యంతోనే.. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సీఎన్‌జీ బైకులతో పాటు, సీఎన్‌జీ ఆటోలను కూడా నిషేదించనున్నట్లు సమాచారం. ఫ్యూయెల్ కార్లను ఎంతవరకు నిషేధిస్తారు అనేదానికి సంబంధించిన వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.



2025 ఆగస్టు 15 నుంచి ఢిల్లీలో కొత్త సీఎన్‌జీ ఆటో రిక్షా రిజిస్ట్రేషన్లను, రెన్యువల్స్ అనుమతించరు. కేవలం ఎలక్ట్రిక్ ఆటోల రెన్యువల్స్, రిజిస్ట్రేషన్లకు మాత్రమే అనుమతి లభిస్తుంది. ఆ తరువాత దశల వారీగా పెట్రోల్, సీఎన్‌జీ వాహనాలను తొలగించనున్నారు. వీటి స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించాల్సి ఉంది.

బైకులు, ఆటోలు మాత్రమే కాకుండా.. ఢిల్లీలో చెత్తను సేకరించే వాహనాలు, సిటీ బస్సులు కూడా ఎలక్ట్రిక్ వాహనాలు అయి ఉండాలి చెబుతున్నారు. కాగా మార్చి 31తో ముగిసిన 'ఈవీ పాలసీ'ని ఢిల్లీ ప్రభుత్వం మరో 15 రోజులు పెంచింది. ఆ తరువాత ఈవీ పాలసీ 2.0 అమలులోకి వస్తుంది. ఫ్యూయెల్ వాహనాలను.. ఎలక్ట్రిక్ వాహనాలతో భర్తీ చేయడమే ఈ కొత్త పాలసీ లక్ష్యం అని అధికారులు చెబుతున్నారు.

### ఢిల్లీ వాయు కాలుష్య సంక్షోభం

దేశ రాజధానిలో చాలా సంవత్సరాలుగా తీవ్రమైన వాయు కాలుష్య సంక్షోభం నెలకొంది. శీతాకాలంలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో ఇది మరింత తీవ్రమవుతుంది. వాహనాల ఉద్గారాలు, నిర్మాణ పనుల నుంచి వచ్చే దుమ్ము, కర్మాగారాల నుంచి వచ్చే పొగ.. పంజాబ్, హర్యానా వంటి సమీప రాష్ట్రాలలోని రైతులు గడ్డిని తగలబెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. పండుగల సమయంలో పటాకులు కాల్చడం, వ్యర్థాలను కాల్చడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. వాయుకాలుష్యం కారణంగా పిల్లలు, వృద్ధులలో శ్వాస సమస్యలు, ఉబ్బసం, గుండె జబ్బులకు కారణమవుతాయని పలువురు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# భారత్‌లో పెట్టుబడులకు భారీ అవకాశాలు

- బ్రిటన్ ఇన్వెస్టర్లకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆహ్వానం
- బ్యాంకులు, పెన్షన్ ఫండ్స్‌తో రౌండ్ టేబుల్ సమావేశం

**లండన్:** భారత్‌లో వివిధ పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టడానికి అపార అవకాశాలు ఉన్నాయని బ్రిటన్ ఇన్వెస్టర్లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. బ్యాంకింగ్ తదితర రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని ఆమె పేర్కొన్నారు.

లండన్‌లో జరిగిన భారత్‌బ్రిటన్ ఇన్వెస్టర్ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. వివిధ పెన్షన్ ఫండ్స్, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలకు చెందిన 60 పైచిలుకు ఇన్వెస్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రకటన ప్రకారం.. సుస్థిర ఆర్థిక వృద్ధి సాధన, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను ఏర్పర్చేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధా న్యం ఇస్తున్నట్లు నిర్మలా సీతారామన్ వివరించారు. నిబంధనల భారాన్ని




తగ్గించి, వ్యాపారాలు.. పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో విదేశీ బ్యాంకులు మరింతగా విస్తరించేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయి' అని మంత్రి చెప్పారు.

**పటిష్టమైన పాలసీల దన్ను..**
మధ్య తరగతి ప్రజల సంఖ్య పెరుగుతుండటం, స్థిరమైన..పటిష్టమైన పాలసీలు అమలవుతుండటం తదితర అంశాల ఊతంతో 2024-2028 మధ్య కాలంలో భారత బీమా మార్కెట్ వార్షికంగా 7.1 శాతం మేర వృద్ధి చెందనున్నట్లు ఆమె వివరించారు. 2032 నాటికి ఆరో అతి పెద్ద ఇన్సూరెన్స్ మార్కెట్‌గా ఎదగనున్నట్లు తెలిపారు.

ఇక టీప్లస్1 సెటిల్మెంట్‌ను 2023లోనే ప్రవేశపెట్టడం ద్వారా ఈ విధానాన్ని అమలు చేసిన అతి కొద్ది బడా సెక్యూరిటీస్ మార్కెట్లలో భారత్ కూడా ఒకటని ఇన్వెస్టర్లకు వివరించారు. 4.6 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో భారత సెక్యూరిటీస్ మార్కెట్ అంతర్జాతీయంగా నాలుగో స్థానంలో ఉందని చెప్పారు. ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సీ) గురించి కూడా మంత్రి వివరించినట్లు ఆర్థిక శాఖ తెలిపింది.

2025 మార్చి నాటికి బ్యాంకులు, బీమా, ఫిన్‌టెక్, ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్, షిప్ లీజింగ్ మొదలైన రంగాలకు చెందిన 800 పైచిలుకు సంస్థలు గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు మంత్రి వివరించారు. స్థూల దేశీయోత్పత్తికి డిజిటల్ ఎకానమీ దన్నుగా నిలుస్తున్న తీరును తెలిపారు. ప్రభుత్వ సానుకూల విధానాలు, వినూత్నమైన స్టార్టప్‌ల తోడ్పాటుతో దేశీయంగా ఫిన్‌టెక్ వ్యవస్థ పటిష్టంగా మారిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. గత అయిదేళ్లలో ఫిన్‌టెక్ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు చెప్పారు. దేశీ యూనికార్న్‌ల సంఖ్యపరంగా అంతర్జాతీయంగా భారత్ మూడో స్థానంలో ఉన్నట్లు సీతారామన్ చెప్పారు.

# తొందరపాటు లేదు..

## అమెరికాతో ఒప్పందంపై పీయూష్ గోయల్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెల కొన్నప్పటికీ 2024 25 ఆర్థిక సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతులు 820 బిలియన్ డాలర్లకు చేరినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 6 శాతం పెరిగినట్లు తెలిపింది. 2023 24లో ఎగుమతులు 778 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం.. 2024-25 ఏప్రిల్ ఫిబ్రవరి మధ్య కాలంలో ఉత్పత్తుల ఎగుమతులు 395.38 బిలియన్ డాలర్ల నుంచి 395.63 బిలియన్ డాలర్లుకు చేరాయి. అలాగే సర్వీసుల ఎగుమతులు 311.05 బిలియన్ డాలర్ల నుంచి 354.90 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2024 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఎగుమతులు, దిగుమతుల పూర్తి వివరాలను వాణిజ్య శాఖ ఏప్రిల్ 15న విడుదల చేయనుంది.

**పరిశ్రమకు మంత్రి గోయల్ భరోసా..**
అమెరికా టారిఫ్‌ల విధింపు నేపథ్యంలో ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, పరిశ్రమ వర్గాలతో వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు,



అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించారు. అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితుల్లో ఇటీవల తలెత్తిన సవాళ్లను అధిగమించడంలో ఎగుమతి సంస్థలకు తోడ్పాటు అందించేందుకు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి భరోసా ఇచ్చినట్లు వాణిజ్య శాఖ తెలిపింది.

ఎర్ర సముద్రం సంక్షోభం, ఇజ్రాయెల్‌హమాస్ ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, కొన్ని సంపన్న ఎకానమీల్లో వృద్ధి నెమ్మదించడం తదితర సవాళ్లు నెలకొన్నప్పటికీ ఎగుమతులు వృద్ధి చెందడం సానుకూలాంశమని ఎగుమతిదారులు, పరిశ్రమను మంత్రి అభినందించారు. వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహించే ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు ఈ సమావేశంలో తమ అభిప్రాయాలు, అంచనాలను తెలిపాయి. కష్టకాలంలో ఎగుమతి సంస్థలను ఆదుకునేందుకు ప్రభుత్వం క్రియాశీలక చర్యలు తీసుకోవాలని కోరాయి.

**అమెరికాతో ఒప్పందంపై కసరత్తు..**
అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం విషయంలో సమతుల్యత సాధించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి చెప్పారు. దేశానికి ప్రయోజనం కలిగే విధంగా సరైన ఫలితాలను రాబట్టేందుకు ప్రభుత్వం 'వేగంగా' పనిచేస్తోందని, 'అనవసర తొందరపాటు' చర్యలు తీసుకోవడం లేదని మంత్రి పేర్కొన్నారు. టారిఫ్‌లపై ఇతర దేశాలు వివిధ రకాలుగా స్పందిస్తున్నాయని ఆయన చెప్పారు. 'విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ ఎదిగింది.

ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలో భారత్ పెద్ద సంస్థలను ఆకర్షించే స్థితిలో ఉంది. కాబట్టి తయారీని పెంచుకునేందుకు, మరిన్ని ఉద్యోగాలను కల్పించేందుకు మనకు అవకాశాలు ఉన్నాయి' అని మంత్రి వివరించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని భారత్, అమెరికా నిర్దేశించుకున్నాయి. ఆ దిశగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కసరత్తు చేస్తున్నాయి. చర్చల తొలి దశ ఈ ఏడాది సెప్టెంబర్ అక్టోబర్‌లో ముగుస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 191 బిలియన్ డాలర్లుగా ఉంది.

## అట్లీ, అల్లు అర్జున్ సినిమాలో స్టార్ హీరోయిన్‌కు ఛాన్స్..

# అందుకేనా ఈ కామెంట్?



**ఇటీవల పలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్న నటి సమంత తెరపై కనిపించి చాలా కాలమే అయ్యింది. అయితే వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకులను పలకరిస్తూనే ఉంది. అంతకన్నా షోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. త్వరలో మళ్లీ నటించడానికి సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా పుష్ప – 2 చిత్రంతో ప్రపంచ స్థాయిలో దుమ్మురేపిన నటుడు అల్లు అర్జున్ తాజాగా అంతకు మించిన చిత్రం చేయడానికి రెడీ అయ్యిపోయారు. ఆయన నటిస్తున్న పాన్ వరల్డ్ చిత్రానికి సబంధించిన ప్రకటన అట్టహాసంగా వెలువడిన విషయం తెలిసిందే. చేసిన ఐదు చిత్రాలతో మంచి విజయాలను అందుకున్న యువ దర్శకుడు అట్లీతో అల్లు అర్జున్ నటించనున్నారు. కోలీవుడ్‌లో చిత్రం చేయాలన్నది అల్లు అర్జున్ చిరకాల కోరిక.**

చాలా కాలం క్రితమే లింగుసామి దర్శకత్వంలో నటించడానికి సిద్ధం అయ్యారు. దీనికి సంబధించిన ప్రకటనను గ్రాండ్‌గా వెల్లడించారు. అయితే కారణాలేమైనా ఆ చిత్రం సెట్‌పైకి రాలేదు. అలాంటిది తాజాగా అల్లుఅర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ వరల్డ్ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ రూ.600 కోట్ల బడ్జెట్‌లో ప్లాన్ చేస్తుంది. ఇది సైన్స్ ఫిక్షన్ కథా చిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. దీంతో ఈ చిత్ర యూనిట్‌కు పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇందులో నటి సమంత కూడా ఉన్నారు. ఆమె ఇంతకు ముందు నటుడు అల్లు అర్జున్‌కు జంటగా సన్నాఫ్ సత్యమూర్తి చిత్రంలో నటించారు. అదే విధంగా దర్శకుడు అట్లీతో మంచి ఫ్రెండ్‌షిప్ ఉంది. ఈయన ఇంతకు ముందు దర్శకత్వం వమించిన మెర్సల్, తెరి చిత్రాల్లో నాయకిగా నటించారన్నది గమనార్హం.

ఇకపోతే నటి సమంత నటుడు అల్లు అర్జున్ గురించి తన ఇన్‌స్ట్రాగామ్‌లో చేసిన పోస్ట్‌లో మళ్లీ ఒక ఏడాది.ఈ అద్భుతమైన నటుడి ఎదుగుదలను చూడటానికి సహనం పాటించలేక పోతున్నాను. తెరపై మిమ్మల్ని ఎప్పుడు చూసినా మధురమైన దిగ్భ్రాంతి. ప్రతిసారి హద్దులు దాటిన చర్యలకు ధన్యవాదాలు. మీ ఆరోగ్యం బాగుండాలి. ఆసక్తి తగ్గకుండా మీరు ప్రేమించే కార్యాలను వరుసగా చేయాలని భగవంతుడు ఆశీర్వదించా అని నటి సమంత పేర్కొన్నారు. సమంత పోస్ట్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా అల్లుఅర్జున్, అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈభారీ చిత్రంలో నటి సమంత కూడా భాగం కానున్నారనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. అయితే ఇందులో నిజం ఎంత అన్నది తెలియాల్సి ఉంది.

## అమ్మతోడు.. ఆస్తికోసం కాదు



**విష్ణు నా కార్లు దొంగిలించాడు**
**మంచు మనోజ్ ఆరోపణ**
**మంచు టౌన్ షిప్ వద్ద మరోసారి ఉద్రిక్తత**

**హైదరాబాద్:** జల్‌పల్లిలోని సినీ నటుడు మోహన్‌బాబుకు సంబంధించిన మంచు టౌన్‌షిప్ వద్ద మరోసారి వివాదం నెలకొంది. తాను లేని సమయంలో నార్సింగిలోని తన నివాసం వద్ద ఉన్న కార్లను విష్ణు దొంగలించాడని పేర్కొంటూ ఈ నెల 8న మంచు మనోజ్ నార్సింగి ఠాణాలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఉదయం 8.30 గంటలకు జల్‌పల్లి శివారులోని మంచు టౌన్‌షిప్ గేట్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మీడియాను లోనికి రానివ్వకుండా టౌన్‌షిప్ చుట్టూ కిలోమీటర్ సరిహద్దులో ఆంక్షలు విధించారు. పోలీసుల సూచనతో 11.45 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోతూ మనోజ్ మీడియా ఎదుట తన ఆవేదన వెలిబుచ్చారు.

**అమ్మపై ప్రమాణం**

గతేడాది డిసెంబర్ 8వ తేదీ నుంచి మంచుటౌన్‌షిప్‌లో ఆరంభమైన గొడవ రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. జల్‌పల్లిలో మొదలైన ఈ గొడవ కాలక్రమేణా తిరుపతిలోని మోహన్‌బాబు వర్సిటీ వరకు తాకింది. జల్‌పల్లిలో తాజాగా మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. మార్చి 27న తాను, తన భార్య ఇంట్లో ఉన్న సమయంలో బయటి వ్యక్తులు గుమిగూడుతున్న విషయమై పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డికి ఫోన్‌తో పాటు, 100 డయల్‌కు కాల్ చేసి రక్షణ కల్పించాలని కోరామన్నారు. అయినప్పటికీ తననే ఇంటి నుంచి బయటికి రావాలని పోలీసులు తెలిపారన్నారు. ఏప్రిల్ 2న తన కుమార్తె మొదటి పుట్టిన రోజు ఇక్కడే పరిమితంగా చేసుకుందామనుకున్నప్పటికీ, స్థానిక పరిస్థితుల దృష్ట్యా రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లామన్నారు. అంతకుముందే నేను అక్కడ లేను, విష్ణును అక్కడ ఏమైనా చేసుకోమని మా అమ్మకు కూడా తెలిపానన్నారు. అమ్మపై ప్రమాణం.. ఇది ఆస్తి కోసం కాదు అన్నారు. తిరుపతిలోని యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి తంతును ప్రశ్నించినందుకే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. డిసెంబర్ 8 నుంచి ఇప్పటి వరకు పహాడీషరీఫ్ పోలీసులు ఒక్క ఛార్జిట్ కూడా దాఖలు చేయలేదని, టౌన్‌షిప్‌లో తనకు సంబంధించి మూడు పెట్ డాగ్‌లు, పిల్లలకు సంబంధించి వస్తువులున్నాయని తెలిపారు. అవి తీసుకొని వెళ్తానని చెప్పినా లోనికి వెళ్లనీయడం లేదన్నారు. పోలీసులకు అన్ని ఆధారాలు ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యహరించారని ఆరోపించారు. తాను రాజస్థాన్‌కు వెళ్లిన వెంటనే విష్ణు తన కార్లను చోరీ చేశారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇంట్లో ఉన్న తన పాత జ్ఞాపకాలను సైతం తొలగించారన్నారు. రౌడీషిటర్ల ఆగడాలపై సీఐకి చెబితే'అవునా పాపం' కదా అంటున్నారు తప్పా చర్యలు శూన్యమన్నారు.

కోర్టులను తప్పదోవ పట్టిస్తున్న ఘటనలపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. కోర్టు ఆదేశాలున్నా ఇంట్లోకి రానివ్వడం లేదన్నారు. బైండోవర్ విషయం తనకు వర్తించినప్పుడు, విష్ణుకు ఎందుకు వర్తించవని ఆయన మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబం కోసం సినిమాలో స్త్రీ వేషధారణలోనూ నటించానని ఆవేదన వ్యక్తం చేశారు. మనోజ్ సంబంధించిన ఎలాంటి విషయాలైనా కావాలంటే.. ఇస్తా బిడ్డ అని నాన్న విష్ణుకు హామీ ఇచ్చారని తెలిపారు. పోలీసులు తన ఫిర్యాదులపై ఎక్కడ కూడా ఛార్జిషీట్‌లో దాఖలు చేయలేదన్నారు. ఇదిలా ఉండగా మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణు యూపీలో కన్నప్ప సినిమా ప్రమోషన్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసి సినిమా కథను వివరించారు.

# తెలంగాణ దండోరా

**తెలంగాణ దండోరా శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మణిక, అనూష, రాధ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో ముప్పానేని రవీంద్ర బెనర్జీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ మొదలైంది. 25 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో శివాజీ పాల్గొంటున్నారు.**

''అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతుందనే అంశాన్ని ఆధారంగా చేసుకుని 'దండోరా' తీస్తున్నాం. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే, హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.



## ఓటీటీలో అసురుడిని ఎదురించిన

# ధీరుడి కథ సడెన్ ఎంట్రీ

**టాలీవుడ్ హీరో ఆది సాయి కుమార్ నటించిన తాజా చిత్రం 'షణ్ముఖ' ఓటీటీ ప్రకటన వచ్చేసింది. మార్చి 21న విడుదలైన ఈ చిత్రాన్ని షణ్ముగం సప్పని దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో అవికా గోర్ హీరోయిన్‌గా కనిపించింది. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేదు. సాప్‌బ్రో ప్రొడక్షన్స్ బ్యానర్‌లో తులసి రామ్ సప్పని, షణ్ముగం సప్పని నిర్మించారు. అయతే, రవి బస్రూర్ అందించిన సంగీతం బాగా ప్లస్ అయిందని చెప్పవచ్చు.**

ఒక అసురుడిని ఎదురించిన ధీరుడి కథ అనే కాన్సెప్ట్‌తో 'షణ్ముఖ' చిత్రం విడుదలైంది. ఇప్పుడు ఆహా తెలుగు ఓటీటీ వేదికగా ఈ మూవీ స్ట్రీమింగ్ కానుంది. 'ఏప్రిల్ 11'న విడుదల కానుందని ఆ సంస్థ ఒక పోస్టర్‌ను విడుదల చేసింది.. ఈ చిత్రంలో ఆదిత్య ఓం, చిరాగ్ జాని, షణ్ముగం సప్పని, మాస్టర్ మను సప్పని, మనోజ్ ఆది, వీర శంకర్, కృష్ణుడు. ఈ మూవీలో ఆది సరసన ఉయ్యాలా జంపాలా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ముద్దుగుమ్మ అవికా గోర్గ్రాండ్‌గా రీ ఎంట్రీ ఇచ్చింది.




**షణ్ముఖ కథేంటంటే..**

చిరాగ్ జానీ(విగాండ) దంపతులకు ఓ విచిత్రమైన రూపంలో కుమారుడు జన్మిస్తాడు. అతన్ని అలా చూసిన తండ్రి కొడుకు రూపాన్ని మార్చాలనే ఉద్దేశంతో కాశీకి వెళ్లి క్షుద్ర పూజలు నేర్చుకుంటాడు. ఆ తర్వాత తిరిగొచ్చిన అతను తన కుమారుడి సాధారణ రూపం కోసం బామ్మర్ది సాయంతో తాంత్రిక పూజలు ప్రారంభిస్తాడు. ఈ క్రమంలోనే ఎస్సైగా పనిచేస్తున్న కార్తీ వల్లభన్(ఆది సాయికుమార్) ఓ డ్రగ్ మాఫియాను పట్టుకునే క్రమంలో ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవుతాడు. వారం రోజుల్లోనే తన తప్పును సరిదిద్దుకోవాలని కార్తీని కమిషనర్ ఆదేశిస్తాడు. ఆ తర్వాత బెంగళూరులో జర్నలిజం చేస్తున్న సారా మహేశ్(అవికా గోర్) తన ఇన్వెస్టిగేషన్ ప్రాజెక్ట్ కోసం హైదరాబాద్‌కు వస్తుంది. ఇక్కడికి వచ్చాక ఎస్సై కార్తీ వల్లభన్ సాయం కోరుతుంది. ఆ సమయంలోనే సారా తన రీసెర్చ్ ప్రాజెక్ట్ గురించి ఓ ఆసక్తికర విషయాన్ని కార్తీకి చెబుతుంది. అసలు ఆమె చేస్తున్న రీసెర్చ్ ప్రాజెక్ట్ ఏంటి? ఆరేళ్లుగా చేస్తున్న ఆ పరిశోధనలో కనిపెట్టిన అమ్మాయిల మిస్సింగ్, అబ్బాయిల సూసైడ్‌లకు ఏంటి సంబంధం? దీని వెనక ఏదైనా హ్యూమన్ ట్రాఫికింగ్ మాఫియా ఉందా? అసలు సారాను చంపాలనుకున్నది ఎవరు? చివరికీ ఈ ఇన్‌స్టిగేషన్ ప్రాజెక్ట్‌లో కార్తీ, సారా సక్సెస్ అయ్యారా? లేదా? అన్నదే అసలు స్టోరీ.

## పీలింగ్స్, దబిడి దిబిడి, అదిదా సర్‌ప్రైజ్ పాటలపై ట్రోలింగ్..

# శేఖర్ మాస్టర్ కంటతడి



**టాలీవుడ్ బెస్ట్ కొరియోగ్రాఫర్లలో శేఖర్ మాస్టర్ ఒకరు. ఎలాంటి పాటయినా సరే తన స్టెప్పులతో నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తాడు. అలా ఎన్నో హిట్ సాంగ్స్‌కు అద్భుతమైన కొరియోగ్రఫీ అందించాడు. కానీ ఈ మధ్య మాత్రం తన డిఫరెంట్ స్టెప్పుల వల్ల విమర్శలపాలవుతూ వస్తున్నాడు. పుష్ప 2లో 'పీలింగ్స్..', డాకు మహారాజ్‌లో 'దబిడి దిబిడి..', రాబిన్‌హుడ్‌లో 'అదిదా సర్‌ప్రైజు..' పాటలు ఆన్‌లైన్‌లో విపరీతమైన ట్రోలింగ్‌కు గురయ్యాయి.**

కొరియోగ్రఫీపై ట్రోలింగ్

స్టెప్పులు శృతిమించాయన్నది నెటిజన్ల వాదన. రానురానూ శేఖర్ మాస్టర్ ఇలా తయారవుతున్నాడేంటి? ఆడవారితో స్టెప్పులు వేయించేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలి కదా, ఆమాత్రం తెలీదా? అని మండిపడ్డారు. ఈ వివాదంపై శేఖర్ మాస్టర్ తొలిసారిగా స్పందించాడు. ఓ షోలో శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ.. ఏ పాటను ఎలా చేయాలో అలాగే చేస్తాం.. అన్ని సాంగ్స్ ఒకేలా చేయము.

**బాగోలేదని చెప్పడం ఈజీనే..**

మాస్ సాంగ్‌ను ఒకలా.. డ్యుయెట్‌ను మరోలా.. ఇంకో సాంగ్ ఉంటే ఇంకోలా.. అలా ఒక్కోటి ఒక్కోరకంగా చేస్తాం. మీరు బాగోలేదని రాసేయడానికి, చెప్పడానికి ఈజీగా ఉంటుంది. కానీ నాకు, నా వెనకాల ఉన్న టీమ్‌కు ఎంతో కష్టమని చెప్తూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇది చూసిన అభిమానులు.. మీరు బాధపడకండి మాస్టర్.. మేమెప్పుడూ మీకు తోడుగా ఉంటాం అని కామెంట్లు చేస్తున్నారు.

# 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్

# 6 జట్లు.. అమెరికా ఫిక్స్..!

**ఒలింపిక్స్‌లో ఆరు జట్లతో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. క్వాలిఫికేషన్ ప్రక్రియను త్వరలోనే ప్రకటించనున్నారు.**

**విశ్వ క్రీడా సంబరం ఒలింపిక్స్‌లో శతాబ్దకాలం తర్వాత క్రికెట్‌కు మళ్లీ చోటు దక్కిన సంగతి తెలిసిందే. దాదాపు 128 ఏళ్ల తర్వాత 2028లో జరగబోయే లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగం కానుంది. ఈ పోటీల నిర్వహణ కోసం ఇప్పటికే కసరత్తు మొదలైంది. కాగా.. ఇందులో ఆరు జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తాజాగా నిర్ణయించారు. ఆతిథ్య దేశమైన అమెరికాకు డైరెక్ట్ ఎంట్రీ దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.**



పురుషులు, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లతో టీ20 ఫార్మాట్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారట. క్వాలిఫికేషన్ ప్రక్రియను ఇంకా నిర్ణయించలేదు. అయితే, ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న అమెరికాకు తప్పకుండా పోటీల్లో స్థానం ఖరారవుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. మిగతా ఐదు జట్ల కోసం ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. టెస్టులు, వన్డేల్లా కాకుండా.. టీ20 ఫార్మాట్‌లో దాదాపు 100 దేశాలు క్రికెట్ ఆడుతున్నాయి. వీటిలో నుంచి తుది జట్లను ఎంపిక చేయడం సవాల్‌తో కూడుకున్నదే అని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.



**లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కోసం ఈవెంట్ ప్రోగ్రామ్‌ను.. అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ ఎగ్జిక్యూటివ్ బోర్డు బుధవారం ఆమోదించింది. ఈ సమావేశంలోనే క్రికెట్‌లో ఆరు జట్లపై నిర్ణయం తీసుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈసారి మొత్తం 351 మెడల్ ఈవెంట్లు నిర్వహించాలని నిర్ణయించారు. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్-సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లక్రాస్ (సిక్సస్), స్క్వాష్‌కు కూడా అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే.**

### 1900.. అదే మొదలు.. చివర..

**1900 ఒలింపిక్స్‌లో క్రికెట్ నిర్వహించారు. అదే తొలిసారి, చివరిసారి కూడా. అప్పుడు డెవాన్ అండ్ సోమర్‌సెట్ వండరర్స్ క్లబ్ (బ్రిటన్), ఫ్రెంచ్ అథ్లెటిక్ క్లబ్ యూనియన్ (ఫ్రాన్స్) మధ్య రెండు రోజుల మ్యాచ్ జరిగింది. అయితే ఈ మ్యాచ్‌లో ఒక్క జాతీయ ఆటగాడూ లేడు. ఈ మ్యాచ్‌లో జట్టుకు 12 మంది చొప్పున ఆటగాళ్లు ఆడటంతో దీనికి ఫస్ట్‌క్లాస్ హోదా కూడా దక్కలేదు. తొలి ఇన్నింగ్స్‌లో బ్రిటన్ 117 పరుగులు చేయగా.. ఫ్రాన్స్ 78 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌ను 145/5 వద్ద బ్రిటన్ డిక్లేర్ చేసింది. ఛేదనలో ఫ్రాన్స్ 26 పరుగులకే కుప్పకూలడంతో బ్రిటన్ 158 పరుగుల తేడాతో నెగ్గింది. అప్పుడు బ్రిటన్‌కు రజతం, ఫ్రాన్స్‌కు కాంస్యం అందించారు. ఆ తర్వాత వీటిని పసిడి, రజత పతకాలుగా మార్చారు. ఆ తర్వాత పలు కారణాలతో క్రికెట్‌ను ఒలింపిక్స్ పోటీల నుంచి పక్కనబెట్టారు.**




## ఐపీఎల్ 2025.. రుతురాజ్ గైక్వాడ్ ఔట్..

# చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ధోనీ

**సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఐపీఎల్ 2025లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు.**

**ఐపీఎల్ 2025లో వరుస ఓటములతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో షాక్ తగిలింది. మోచేయి గాయం కారణంగా కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో సీనియర్ ఆటగాడు మహేంద్రసింగ్ ధోనీ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ధ్రువీకరించాడు. చెన్నై తదుపరి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. ఏప్రిల్ 11న చెపాక్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.**

మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ముందు రుతురాజ్ గాయపడినట్లు వార్తలొచ్చాయి. కానీ, ఆ మ్యాచ్‌లో రుతురాజ్ ఆడాడు. ఈ సీజన్‌లో గైక్వాడ్ ఐదు మ్యాచ్‌లు ఆడి 150.62 స్ట్రైక్‌రేట్‌తో 122 పరుగులు చేశాడు. ముంబయితో జరిగిన మ్యాచ్‌లో 26 బంతుల్లోనే 53 పరుగులు చేశాడు. రాజస్థాన్ రాయల్స్‌పై 44 బంతుల్లో 63 రన్స్ చేశాడు. మిగిలిన మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు.

2023 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన ధోనీ.. 2024 సీజన్‌కు ముందు సీఎస్కే కెప్టెన్సీ పగ్గాలను రుతురాజ్‌కు అప్పగించాడు. కానీ, గత సీజన్‌లో చెన్నై ప్లే ఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఓడి లీగ్ దశలోనే నిష్క్రమించింది. ఈ సీజన్‌లోనూ చెన్నై పరిస్థితి బాగోలేదు. ముంబయితో జరిగిన తొలి మ్యాచ్‌లో గెలిచిన ఆ జట్టు.. తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ధోనీ కెప్టెన్సీలోనైనా చెన్నై పుంజుకుంటుందోమో చూడాలి.

# దంచికొట్టిన కేఎల్ రాహుల్..

# ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది.**

**బెంగళూరు:** ఐపీఎల్ 18లో ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ అందుకుంది. ఢిల్లీకిది వరుసగా నాలుగో విజయం. తొలుత ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ 17.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కేఎల్ రాహుల్ (93*; 53 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) దంచికొట్టాడు. స్టబ్స్ (38*; 23 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) రాణించాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 2, యశ్ దయాల్, సుయాశ్ శర్మ ఒక్కో వికెట్ తీశారు.



**టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ బ్యాటర్లలో ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (37; 17 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లీ (22; 14 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. రజత్ పటీదార్ (25), కృనాల్ పాండ్య (18) పరుగులు చేశారు. దేవ్‌దత్ పడిక్కల్ (1), లివింగ్‌స్టన్ (4), జితేశ్ శర్మ (3) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. చివర్లో టిమ్ డేవిడ్ (37*; 20 బంతుల్లో 2 ఫోర్, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ స్కోరు 150 దాటింది. ఢిల్లీ బౌలర్లలో విప్రాజ్ నిగమ్ 2, కుల్‌దీప్ యాదవ్ 2, ముకేశ్ కుమార్, మోహిత్ శర్మ చెరో వికెట్ పడగొట్టారు.**




## రికార్డులు తిరగరాసిన

# సాయి సుదర్శన్

**సాయి సుదర్శన్ ఐపీఎల్‌లో తన సత్తా చాటుతున్నాడు. బుధవారం రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ తరఫున ఓపెనర్‌గా అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు**

యువ సంచలనం సాయి సుదర్శన్ ఐపీఎల్‌లో తన సత్తా చాటుతున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా బుధవారం రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఓపెనర్‌గా అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 53 బంతుల్లో 82 పరుగులు సాధించాడు. అతడు తన ఇన్నింగ్స్‌లో ఎనిమిది ఫోర్లు, మూడు సిక్స్‌లు బాదాడు. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 217 పరుగుల భారీ స్కోర్ చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఈసందర్భంగా మ్యాచ్ అనంతరం పిచ్ గురించి మాట్లాడాడు. 'పిచ్‌పై మొదట్లో బంతి కాస్త స్వింగ్ అయింది. కానీ తర్వాత బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది. మ్యాచ్ ఆరంభంలో జోఫ్రా ఆర్చర్ బంతులను ఆడటం కష్టంగా అనిపించింది. కానీ తర్వాత మేం పిచ్‌ను అర్థం చేసుకొని, దానికి అనుగుణంగా బ్యాటింగ్ చేశాం. మేం నిజానికి మరో 15 పరుగులు అదనంగా చేస్తాం అనుకున్నాం. అయినా మేం చేసింది మంచి స్కోరే' అని సాయిసుదర్శన్ అన్నాడు.

**రెండో అత్యధిక పరుగుల వీరుడు**

ఈ 81 పరుగుల ప్రదర్శనతో ఐపీఎల్‌లో 30 ఇన్నింగ్స్ తర్వాత అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సాయి సుదర్శన్ నిలిచాడు. ఇతడు 1307 పరుగులు చేయగా.. షాన్ మార్ష్ 1338 పరుగులతో మొదటిస్థానంలో ఉన్నాడు. క్రిస్ గేల్ (1141 పరుగులు) మూడో స్థానంలో, కేన్ విలియమ్సన్ (1096 పరుగులు) నాలుగో స్థానంలో, మ్యాథ్యూ హెడెన్ (1082 పరుగులు) అయిదో స్థానంలో ఉన్నాడు. ఐపీఎల్‌లో వరుసగా అయిదుసార్లు 50+ స్కోర్లు చేసిన రికార్డు కూడా సాయి సుదర్శన్ పేరిటే ఉంది.

# సింధు నిష్క్రమణ

**ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు పోరాటం ముగిసింది. కొంతకాలంగా ఫామ్‌లో లేక ఇబ్బందులు పడుతున్న సింధుకు ప్రిక్వార్టర్‌ఫైనల్లో చుక్కెదురైంది.**




**ఈ కబురు, (చైనా):** ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు పోరాటం ముగిసింది. కొంతకాలంగా ఫామ్‌లో లేక ఇబ్బందులు పడుతున్న సింధుకు ప్రిక్వార్టర్‌ఫైనల్లో చుక్కెదురైంది. గురువారం మహిళల సింగిల్స్ పోరులో సింధు 1221, 2116, 1621తో మూడో సీడ్ అకానె యమగూచి (జపాన్) చేతిలో పోరాడి ఓడింది. పురుషుల సింగిల్స్‌లోనూ భారత్‌కు పరాభవం తప్పలేదు. ప్రిక్వార్టర్స్‌లో ప్రియాన్షు రజావత్ 1421, 1721తో అయిదో సీడ్ కొడయ్ నరవొక (జపాన్) చేతిలో, కిరణ్ జార్జ్ 2119, 1321, 1621తో మూడో సీడ్ కున్లావత్ వితిద్సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం చవిచూశారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో జోడీ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో ధ్రువ్ తనీషా జోడీ 1221, 2116, 2118తో హాంగ్ వీ నికోల్ గొంజాలెస్ (చైనీస్ తైపీ) జంటపై విజయం సాధించింది. అశిత్ సూర్య అమృత ప్రముతేష్ జోడీ 1121, 1421తో జెన్ బ్యాంగ్ షిన్ వీ (చైనా) జంట చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో హరిహరన్ రూబన్ కుమార్ జోడీ 1521, 1421తో ఆరోన్ చియా వూ యిక్ (మలేసియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

# ట్రోలింగ్ వల్ల బాధపడటం లేదు..

## నిజమైన అభిమానులు ఎలా ఉంటారంటే: అశ్విన్

**రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్ 2025లో పెద్దగా రాణించట్లేదు. దీంతో అతడిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది సోషల్ మీడియాలో అతడిని ట్రోల్ చేస్తున్నారు.**

దాదాపు 12 ఏళ్ల తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్న రవిచంద్రన్ అశ్విన్ .. ఈ ఐపీఎల్ సీజన్‌లో అంచనాలను అందుకోలేకపోతున్నాడు. ఒకప్పుడు తన స్పిన్ మయాజాలంతో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు చుక్కలు చూపించిన యాష్.. ఇప్పుడు ఏ మాత్రం ప్రభావం చూపడం లేదు. భారీగా పరుగులు ఇవ్వడంతోపాటు వికెట్లూ తీయడం లేదు. ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి 9.88 ఎకానమీతో ఐదు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. దీంతో అశ్విన్ ఆటతీరుపై విమర్శలు వస్తున్నాయి. కొంతమంది నెటిజన్లు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. దీనిపై అశ్విన్ తాజాగా స్పందించాడు. నిర్మాణాత్మక విమర్శలను స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నాడు. బాగా ఆడకపోతే ఇప్పటికీ తన తండ్రి చీవాట్లు పెడతాడని చెప్పాడు. అయితే, తరచూ ఉద్దేశపూర్వకంగా తనపై జరుగుతున్న ట్రోల్స్‌తో ఎప్పుడూ బాధపడలేదని అశ్విన్ అన్నాడు.

'సాధారణంగా ఓటమిని ఎవరూ ఇష్టపడరు. నిజం చెప్పాలంటే ట్రోలింగ్‌ల వల్ల నేను బాధపడటం లేదు. ఎవరైనా మన గురించి మాట్లాడుతూ మన లోపాలను ఎత్తిచూపుతూ ఉంటే అంతకుముందు ఉన్నతస్థానంలో ఉన్నామని అర్థం. మేము దానిని నిర్మాణాత్మకమైన విమర్శగా స్వీకరించవచ్చు. కానీ, కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేసి ట్రోల్ చేస్తారు. నిర్మాణాత్మక విమర్శకు, ఉద్దేశపూర్వకంగా చేసే విమర్శను నేను సులభంగా గుర్తించగలను. నేను దాని గురించి ఎక్కువ చింతించను. ఈరోజు కంటే రేపు మరింత మెరుగ్గా ఆడటంపై దృష్టిపెడతా. ఇదే నా జీవిత మంత్రం. నేను బాగా ఆడకపోతే ఇప్పటికీ మా నాన్న మందలిస్తాడు. ప్రేమ ఉన్న చోట నుంచి విమర్శలు వస్తే మంచిదే.




**ఆర్సీబీ ఫ్యాన్స్ అలా కాదు..**

**పెద్ద టోర్నమెంట్ల సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉంటా. రాజస్థాన్ రాయల్స్‌కు ఆడినప్పుడు కూడా ఇదే పనిచేశా. ఇప్పుడూ అదే చేస్తున్నా. టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతున్నప్పుడు ఆటపైనే దృష్టిపెడతా. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ ఏ విషయంపై కామెంట్ చేయను. నేను బాగా ఆడనప్పుడు నా స్నేహితులు కొన్నిసార్లు 'బాధ పడకు. ధైర్యంగా ఉండు' అని మెసేజ్ చేస్తారు. ఇలా కూడా మెసేజ్ చేయొద్దని వారిని కోరుతున్నా. బయట ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఆసక్తి నాకు లేదు. కొన్నిసార్లు ఒక ప్లేయర్‌ని ఎందుకు ట్రోల్ చేస్తున్నారో తెలియని వారుంటారు. వారు కోపంతో ట్రోల్ చేస్తారు. ఆటగాళ్లు, ఫ్రాంఛైజీపై అభిమానం గురించి గతేడాది దినేశ్ కార్తిక్ తో కుట్టీ స్టోరీస్ ఎపిసోడ్ చేశా. ఆర్సీబీ అభిమానుల గురించి అతను నాకో విషయం చెప్పాడు. ఆర్సీబీ ఫ్యాన్స్ తమ ఆటగాళ్లను ఏ దశలోనూ తక్కువ చేసి చూడరని అన్నాడు. నేను దానిని అంగీకరిస్తున్నాను. ఏ, ఆటగాడు కావాలని తప్పులు చేయడు. కానీ, మీ విమర్శలు, ట్రోల్స్ నిర్మాణాత్మకంగా ఉండవచ్చు. అదే సమయంలో తమ అభిమాన ఆటగాళ్లు బాగా ఆడని సందర్భాల్లో మద్దతుగా నిలిచే ఫ్యాన్స్ కూడా ఉన్నారు. వారు నిజమైన అభిమానులు అని నేను నమ్ముతున్నాను' అని అశ్విన్ వివరించాడు.**